భట్టిప్రోలు నాగసుందరి సంక్రాంతి కథానికల పోటీలో
సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.

కథ

# తోటమాలి




"అమ్మా ! మందులన్నీ పెట్టుకున్నావా?" చక్రపాణి తల్లిని అడిగాడు తను ఆఫీసుకి వెళ్ళటానికి వుద్యుక్తుడౌతూ.

"పెట్టుకున్నాను ! నువ్వు ఆఫీసుకి బయలుదేరుతున్నావా?" అంటూ సుభద్ర గదిలోంచి వచ్చింది.

ఆ ! బయలుదేరుతున్నాను ! యింపార్టెంట్ మీటింగొకటి వుంది ! అది లేకపోతే నీతో పాటు నేనూ వచ్చేవాడిని మనవూరు ! మన మాష్టారు పోయారంటే ఎంతో బాధగా వుంది !" అన్నాడు చక్రపాణి.

"పోనీలే - నీకు వీలున్నప్పుడు వద్దువుగాని! అయినా ఆయన తరపున అక్కడ ఎవరున్నారని పలకరించటానికి !" సుభద్ర అంది కొడుకు రాలేకపోతున్నందుకు నొచ్చుకోకూడ దన్నట్టుగా.

"మరినువ్వెందుకు వెళ్తున్నావమ్మా!" తల్లి వైపు ఆపేక్షగా చూస్తూ అడిగాడు చక్రపాణి.

కొడుకు ప్రశ్నకి చిన్నగా నవ్వుతూ అంది సుభద్ర "ఆ యింటిని పలకరించటానికి ! ఆ మాష్టారితో అనుబంధం పెనవేసుకున్న మన యింటిని పలకరించి సముదాయించటానికి !" ఆవిడ గొంతులో బాధ ధ్వనించింది.

"నాకు తెలుసమ్మా ! అక్కడికి చేరగానే నాకు ఫోన్ చెయ్యి ! మన డ్రైవర్‌కి చెప్పాను కాస్త నిదానంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళమని!" చక్రపాణి వెళ్ళిపోయాడు.

అక్కడే టి.వి. చూస్తూ కూర్చున్న రోహిణి అత్తగారి ప్రయాణంతో తనకేం సంబంధం లేనట్టుగా తన ప్రపంచంలో తను వుంది. అయిదు నిముషాల్లో అన్నీ సిద్ధం చేసుకుని డ్రైవర్ని కారు బయటికి తియ్యమని చెప్పింది సుభద్ర. బయలుదేరుతున్నప్పుడు "వస్తానమ్మా రోహిణీ!" అంటూ కోడలికి చెప్పింది.

రోహిణి లేచి ఫ్రిజ్‌లోంచి "పళ్ళున్న ఓ కవరు తీసి అత్తగారి చేతికి యిస్తూ దారిలో దాహంగా అనిపిస్తే తినొచ్చు ! ఈ పళ్ళుంచండి!" అంటూ యిచ్చింది. "అలాగేనమ్మా !" అంటూ ఆ కవరు తీసుకుని బయలు దేరింది సుభద్ర. డ్రైవరు సామానుని కార్లోపెట్టాడు. మరోసారి కోడలితో చెప్పింది వెళ్ళి వస్తానని.

ప్రయాణంలో ఓ ప్రత్యేకత వుంది. తీరుబడిగా ఆలోచనల్లో మునిగిపోవచ్చు ! ఆలోచనా ప్రవాహానికి అడ్డు తగిలే అంశాలేమీ వుండవ్. యింట్లో అయితే ఏదో ఒక బాధ్యత పిలుస్తూవుంటుంది. అదే కాకుండా వెనక్కి కదిలి వెళ్ళిపోయే చెట్లూ, వినీల ఆకాశం - ఆలోచనలకి పదును పెడతాయ్. రైలు ప్రయాణం

ధర్భాలక్ష్మి అన్నపూర్ణ

అయితే మరీను. సుభద్రకి తను చేసిన రైలు ప్రయాణాలు జ్ఞాపకం వచ్చాయ్. రైలులో వెళ్తానంటే కొడుకు వీల్లేదు అనటం జ్ఞాపకం వచ్చి నవ్వుకుంది. కొడుకు ఆపేక్షకి అవధులు లేవు. డ్రైవర్ భక్తిగీతాలు మంద్రస్వరంలో వినిపించేలా పెట్టాడు. అవి సన్నగా చెవులని సోకుతుంటే వాటిని ఆస్వాదిస్తూనే సుభద్ర ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది. గతించిన జీవితం అంతా గబగబా జ్ఞాపకం వచ్చి - ఆ జ్ఞాపకాల వేగం ప్రస్తుత జీవితం దగ్గర ఆగిపోయింది.

ఏదో వెలితి - ఎందుకు అనేది స్పష్టంగా అర్థం కాని మానసిక స్థితి. ఈ వయస్సులో తనలాంటివాళ్ళకి మనస్సులో వెలితి ఏర్పడటానికి కారణాలేమై వుంటాయ్ సాధారణంగా - పిల్లల అనాధరణ ! కొంత మందికి ఆర్థిక యిబ్బందులు ! అందరికీ ఒకేలా వుండేవి ఆరోగ్యంలో లోపాలు ! వీటిల్లో తనకి ఏ యిబ్బందీ యించుమించుగా లేదనే చెప్పవచ్చు. అయినా మనస్సులో ఏదో వెలితి. కొడుకు ఆదరణకి లోటు లేదు. కోడలు తన ప్రపంచంలో తను వుంటుంది. తన ఉనికిని ఆమె పట్టించుకున్నట్టుగా అనిపించదు. అలా అని తనని ఏనాడు పల్లెత్తు మాట అనలేదు.

కొడుకు మనస్సులో తనపట్ల అభిమానం పొంగిపొరలుతున్నా వాటిని తనివితీరా తృప్తిగా వ్యక్తీకరించటానికి సమయం దొరకదు. దొరికిన ఆ కాస్త సమయంలో భార్యకి ముఖ్యస్థానం యివ్వాలి ! తనకోసం ఎప్పుడోగాని సమయం దొరకదు కొడుక్కి అందుకని అతన్ని ఎప్పుడూ తప్పు పట్టలేదు సుభద్ర మనస్సు.

కానీ ఏదో తెలియని వెలితి ! ఎవరికీ చెందని, అక్కర్లేని జీవితమా తనది అన్న ఓ భయంకర భావం ! తప్పు - ఈ భావం చాలా తప్పు అని మనస్సును ఓ పక్క నుంచి హెచ్చరిస్తున్నా ఈ భావం మాత్రం రాక్షసిలా కబళించేస్తూనే వుంది. తనతోడు లేకపోయినా కొడుకు ఆనందంగా జీవించగలడు - తల్లి వుంది కనుక ఆపేక్ష చూపించకపోతే బాధపడు తుందన్న భావం తప్ప - తను లేనంత మాత్రాన వీళ్ళ జీవితం ఆగిపోదు ! కోడలికి తను వున్నా ఒకటే - లేకపోయినా ఒకటే ! లేకపోతేనే ఒకింత స్వేచ్ఛగా వుంటుందేమో ఆమెకి. పోనీ చిన్నారి మనవల్ని అక్కున చేర్చుకుందామంటే వాళ్ళని రెసిడెన్షియల్ స్కూళ్ళల్లోపెట్టేశారు ! ఐశ్వర్యం చూపిస్తున్న ఒంటరి తనపు మార్గాలు !

పల్లెటూల్లో తమ యింట్లో వుంటూ వచ్చిన మాష్టారి పరిస్థితి మరీను ! పిల్లలు లేరు ! ఆస్తులు లేవు. రిటైరయిపోయాక, వూరు విడిచి వెళ్ళటానికి బాధపడుతుంటే తమ యింట్లో వుచితంగా వుండి ఆ యింటికి కళకాంతులు తీసుకురమ్మని వేడుకుంది. సంవత్సరం క్రితమే భార్య పోయింది. రెండు రోజుల క్రితం ఆయనా ఆవిడని అనుసరించారు. వూర్లో తెలుసున్నవాళ్ళే ఆయనకి అంతిమ వీడ్కోలు చెప్పారు.

సుభద్ర ఆలోచనల్లో వుండగానే కాస్సేపటికి నిద్ర పట్టేసింది. మళ్ళీ మెలకువ వచ్చేసరికి వూరు వచ్చేసింది. ఆ వూరి పొలిమేరల్లోకి కారు ప్రవేశిస్తూనే సుభద్ర వులిక్కి పడినట్టుగా లేచింది. యింకా అమ్మ గారిని లేపుదాం అనుకుంటున్న డ్రైవర్ చిన్నగా నవ్వుకున్నాడు.

యింట్లోకి వెళ్తూనే మాష్టారి జ్ఞాపకాలు సుభద్ర మనస్సుని చుట్టుముట్టాయ్ ! మహా సాత్వికమైన మనిషి. యింటికి చేరుకున్నట్టుగా వెంటనే కొడుక్కి ఫోన్ చేసింది. సుభద్ర పొలంచేసే రైతు పరుగెత్తుకుంటూ వచ్చాడు. వూర్లో తెలుసున్నావిడ వచ్చి కాఫీ, ఫలహారాలు యిచ్చి భోజనం తమ యింట్లోనే చెయ్యాలని చెప్పి వెళ్ళింది.

రైతు మాష్టారి గురించి చెబుతూ ముందు గదిలో ఓ మూలగా పడివున్న చిన్న చిన్న సంచులు చూపిస్తూ అన్నాడు "ఈ విత్తనాలన్నీ వెయ్యాలని మంచి తోట పంచాలనీ నా చేత తెప్పించుకున్నారండి! యింతలోనే వెళ్ళిపోయారు !"

సుభద్రని యిక్కడ దించిన కారుడ్రైవరు తిరిగి యింటికి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం పడుకుని లేచిన సుభద్ర పెరటివైపు అడుగులు వేసి పరీక్షగా చూడ సాగింది. పెరట్లో నీళ్లు పోసే వాళ్ళు లేక వాడి పోయిన రకరకాల చిన్నారి మొక్కలు. గబగబా నీళ్ళు పట్టి మొక్కలమీద చల్లి కుదుళ్ళలో పోసింది సుభద్ర! విశాలమైన ఆ యింటి ప్రాంగణంలో ఒక్కో అడుగు వేస్తూ, ఒక్కో జ్ఞాపకాన్నీ తల్చుకుంటూ సుభద్ర మళ్ళీ ఈ మొక్కల దగ్గరికి వచ్చేసరికి యిందాక తలలు వాల్చేసిన చిన్నారి లేత మొక్కలు యిప్పుడు తాజాగా నవ్వుతూ లేచి నిలబడిన ఆకులతో తనని చూసి నవ్వుతున్నట్టుగా అనిపించేసరికి సుభద్రకి తన హృదయం మీద పన్నీటిజల్లు కురిసినట్టుగా అని పించింది. అవి స్వచ్ఛంగా మెరుస్తూ తలలు వూపుతూ "థ్యాంక్యూ ! థ్యాంక్యూ!" అంటున్నట్టుగా అని పించింది. "యిక్కడే వుండి మాకు రోజూ నీళ్ళు పొయ్యవా ? నువ్వు లేకపోతే వేం బతకలేం అని ప్రాధేయపడుతున్నట్టుగా అనిపించింది.

సుభద్ర ఆనందానికి అంతు లేదు ! లోపలికి వెళ్ళగానే మాష్టారు తెప్పించిన విత్తనాలన్నీ "మాకు మొలకెత్తా లని వుంది ! ఆకుపచ్చగా ఈ సృష్టిలో మెరవాలని వుంది ! మమ్మల్ని భూమిలోకి చేర్చి నీళ్ళు పోయవూ?" అని అభ్యర్థిస్తున్నట్టుగా అనిపించింది. ఒక్క క్షణం ఖాళీ పెరడంతా దృష్టి సారించిన ఆమెకి ఎండిపోయి నట్టుగా వున్న ఆ భూమి అంతా నువ్వు యిక్కడే వుండి మమ్మల్ని సస్యశ్యామలం చెయ్యవా?" అని అభ్యర్థిస్తున్నట్టుగా అనిపించింది. సుభద్ర హృదయం ఆనందంతో పరవళ్ళు తొక్కింది.

యిక్కడే వుండాం అనుకుంటున్నతల్లి నిర్ణయం విని చక్రపాణి ముందు బాధపడ్డాడు. కానీ సుభద్ర తన మనస్సులో భావాలన్నిటినీ పూస గుచ్చినట్టుగా చెప్పగానే "ఒక షరతు మీద ఒప్పు కుంటాను ! ఓ మంచి తోటమాలిని పెడదాం - నువ్వు కొన్నాళ్ళు నా దగ్గర, కొన్నాళ్ళు నీ మొక్కల దగ్గర వుండాలి !" అన్నాడు.

స్త్రీ ఎప్పుడూ తోటమాలిగానే జీవించాలను కుంటుంది ! వయస్సులో వున్నప్పుడు సంసారమనే తోటకి ! యిప్పుడు ఈ చిన్నారి మొక్కల తోటకి !

## యిష్టం

మధ్యాహ్నం ముసురుపట్టి
చల్లగాలి వింజామరలతో
సాయం సందెను తలపిస్తూ
ఓ జల్లు కురిస్తే యిష్టం.
ధవళ వస్త్రాల్లా నీటి తెరలు
అటూ ఇటూ కదులుతూ
ఆకాశం నుండి సంతత ధార కురుస్తుంటే
కిటికీ లోంచి చూడటం యిష్టం.
వాన వెలిశాక పచ్చగా నవ్వే చెట్టూ చేమల్ని
స్నానమాడిన రంగుల పక్షుల్ని పరికిస్తూ
ఏ టీ బంకు వైపో హాయిగా
ఎగిరిపోవడం యిష్టం.
చినుకుల్లో చిందులేస్తూ
కాలువల్లో కాగితం పడవలు విడుస్తూ
నిలువెల్లా తడుస్తూ, పెద్దాళ్ళకు జడుస్తూ
ముంగిట్లో ఎగిరిపడే వడగళ్ళను
మురిపెంగా ఏరుకునే పసితనమంటే
నీకైనా - నాకైనా
ఎంతో యిష్టం.

**- కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్**